క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి విరాళాలు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి ఆలయం, గంగానమ్మ ఆలయాల అభివృద్ధి పనులకు గురువారం విరాళాలు అందజేశారు. సత్యనారాయణ స్వామి ఆలయ గోపురం, గంగానమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి ఉప్పలపాటి కృష్ణమూర్తి జ్ఞాపకార్థం రూ. 10వేలు, మరొక దాత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు రూ.10వేలను చాపరాల సుధాకర్ చేతుల మీదుగా గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. కార్యక్రమంలో నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, సంత కమిటీ డైరెక్టర్ వల్లభనేని బుడ్డిబాబు, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి తదితరులు పాల్గొన్నారు.

స్వయం పోషక సంఘాలతో మహిళాభివృద్ధి



గుడివాడ టౌన్: మహిళలు ఆర్థిక ఎదుగుదలకు స్వయంపోషక సంఘాలు ఎంతగానో దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ ఎస్. మనోహర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో మెప్మా బజార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వయంపోషక సంఘాల ద్వారా మహిళల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వినియోగించి వస్తువులు తయారు చేయడం, వాటిని అమ్మడం వల్ల లాభాలు ఆర్జించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 25 నుంచి 40 రకాల ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకం చేశారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, సీఓలు, ఆర్పీలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రధానోపాధ్యాయుల అనుమతితో ఏర్పాటు చేసి ఈ క్లబ్‌లలో సైన్స్, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులను క్లబ్ ఇన్‌చార్జిగా నియమించాలి. ప్రతి తరగతి నుంచి ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులను సెలెక్ట్ చేసి క్లబ్‌లో మొత్తం 12 మంది సభ్యులు ఉండేలా చూడాలి. ఈ క్లబ్‌లకు సరళమైన భాషలో ఉచ్చరించే విధంగా పేరు పెట్టాలని తెలిపారు. విద్యార్థులకు పచ్చటి ఎకో బ్యాచ్‌లు ఇవ్వాలి. ప్రతి శుక్ర, శనివారాల్లో క్లబ్‌ల సమావేశాలు నిర్వహిస్తూ చిన్న చిన్న పనుల ద్వారా పిల్లలకు పర్యావరణంపై ఆసక్తిని కల్పించాలని సూచించారు.

మొవ్వ మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు మృతి



మొవ్వ: మొవ్వ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సంకుల కోటేశ్వరరావు (78) అస్వస్థతతో స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ఆయన స్వగృహంలో గురువారం మృతిచెందారు. ప్రభుత్వం పంచాయతీల్లో రిజర్వేషన్ ప్రారంభించిన సమయంలో తొలిసారి కమ్యూనిస్టు నేత అయిన కోటేశ్వరరావు ఏడు సంవత్సరాలకు పైగా ఎస్సీ సర్పంచ్‌గా కొనసాగి గ్రామాభివృద్ధికి పాటుపడ్డారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, నిడుమోలు మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య, గ్రామస్తులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కోటేశ్వరరావు అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముదినేపల్లి రూరల్: సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ముదినేపల్లి సెక్షన్ విద్యుత్ ఏఈ పూర్ణచంద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి విస్తరణ, విద్యుత్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

సామిత్వపై ముగిసిన శిక్షణ

ముదినేపల్లి రూరల్: సామిత్వ సర్వేపై గత రెండు రోజులుగా మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులకు పంచాయతీరాజ్ అధికారులు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. బుధవారం ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో వై.రామకృష్ణ ప్రారంభించారు. శిక్షణలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయాల సిబ్బంది గ్రామాల్లో ఇళ్లు, నివేసన స్థలాలు, ఎటువంటి డాక్యుమెంట్లు లేని స్థలాలను సర్వే చేయడం, సరిహద్దులు గుర్తించి యజమానులకు పట్టాలు పంపిణీ చేయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నిండుకుండలా కృష్ణమ్మ..!

- కృష్ణానదికి పెరిగిన వరద
- లంక గ్రామాలకు పడవలపై రాకపోకలు
- అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



తోట్లవల్లూరు వద్ద పడవలో రాకపోకలు సాగిస్తున్న లంక గ్రామాల ప్రజలు

తోట్లవల్లూరు: కృష్ణమ్మ జలకళతో కళకళలాడుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో నిండు కుండలా దర్శనమిస్తోంది. కృష్ణా నదికి వరద రాకతో కరకట్ట వెంబడి గ్రామాల రైతులు, లంక గ్రామాల ప్రజల్లో ఆందోళన నెలకొంది. వివరాలలోకి వెళితే.. తోట్లవల్లూరు వద్ద కృష్ణానదిలో వరద పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటిని అధికారులు విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు విడుదల చేస్తున్న విషయం విదితమే. దీంతో స్థానిక కృష్ణానది పాయల్లో వరద ప్రవాహ తీవ్రత క్రమంగా పెరుగుతోంది. సుమారు మూడు లక్షల క్యూసెక్కుల వరకు వరద తీవ్రత ఉండొచ్చని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు లంక గ్రామాల ప్రజలను, రైతులను అప్రమత్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రొయ్యూరు శివారు తోడేళ్లదిబ్బలంక, వల్లూరుపాలెం శివారు రావిచెట్టులంక, పాములలంక, తుమ్మలపచ్చిక లంక, చాగంటిపాడు శివారు పిల్లివానిలంక, దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంక, ఐలూరు శివారు కనిగిరిలంక, ములకలపల్లి లంక ఉన్నాయి. ఆయా లంక గ్రామాల్లో సుమారు 3,500 వరకు జనాభా నివశిస్తున్నారు.

పడవలపైనే ప్రయాణం

కృష్ణానదికి వరద రాకతో గత వారం రోజులుగా లంకలకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. లంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. లంక గ్రామాలకు నిత్యావసర సరుకులు, పంట పొలాలకు ఎరువులు, పంట ఉత్పత్తులు తరలించాలన్నా, పశుగ్రాసం తెచ్చుకోవాలన్నా పడవలే శరణ్యం. వరద కారణంగా నదిలో ఉన్న తాత్కాలిక రహదారులు దెబ్బతిని మునిగిపోవడంతో పడవ ప్రయాణాలు తప్పనిసరి అయ్యాయి. వర్షాకాలం కావడం, తరచూ నదికి వరద వచ్చే అవకాశం ఉండటంతో ఆగస్టు నుంచి నవంబర్ వరకు నాలుగు నెలలపాటు తమకు పడవ కష్టాలు తప్పవని లంక గ్రామాల ప్రజలు, రైతులు, కూలీలు చెబుతున్నారు.

అన్నదాతల్లో ఆందోళన

కృష్ణానదిలో వరద తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అన్నదాతల్లో ఆందోళన మొదలైంది. గత ఏడాది వచ్చిన వరదతో లంకల్లో పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. మళ్లీ ఇప్పుడు నదికి వరద వస్తోందనే సమాచారం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. నాలుగు లక్షల క్యూసెక్కుల వరకు వచ్చే వరదతో ఇబ్బంది ఉండదని, అది దాటిన దగ్గర నుంచి పంట పొలాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుందని భయాందోళన చెందుతున్నారు. అధికారులు బ్యారేజి నుంచి వరదనీటిని ఒక క్రమపద్ధతిలో విడుదల చేస్తూ పంట పొలాలకు ఇబ్బంది లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



తోట్లవల్లూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది



పడవలో నుంచి అరటి గెలలను వ్యానులోకి ఎక్కిస్తున్న కూలీలు

వైఎస్సార్ సీపీలో మహిళలకు ప్రాధాన్యం



జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌తో తుమ్మరాడ శ్రవంతి, ఇతర కార్పొరేటర్లు

కై కలూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ పదవుల్లో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తారని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) తెలిపారు. ఇటీవల వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ఏలూరు కార్పొరేటర్ తుమ్మరాడ శ్రవంతి స్థానిక పార్టీ కార్యాలయంలో డీఎన్నార్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి పార్టీ విజయానికి దోహదపడాలని డీఎన్నార్ సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఏలూరు పట్టణ మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్లు జుజ్జువరపు విజయ నిర్మలా, కేథారేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

సింగలూరు వాసుల దాహార్తిని తీర్చండి..



తాగునీటి సమస్యను ఎంపీడీఓ ఇమ్రాన్‌కు విన్నవిస్తున్న డాక్టర్ శ్యామ్‌కుమార్

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం చంద్రాల శివారు సింగలూరు వాసులకు మంచినీటి సమస్యను పరిష్కరించి వారి దాహార్తిని తీర్చాలని ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ అధికారులకు విన్నవించారు. సింగలూరులో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్, డెప్యూటీ ఎంపీడీవో ఏజేఎల్ నరసింహారావు గురువారం గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరారు. కలుషితమైన తాగునీటి సమస్య వల్ల చర్మ వ్యాధులు వస్తున్నాయని స్థానిక మహిళలు అధికారులకు విన్నవించారు. సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ఇచ్చారు. గ్రామ సర్పంచ్ కాలిశెట్టి అర్జునరావు, కార్యదర్శి రాజేంద్ర పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ



గుడివాడలో ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: విద్యుత్ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఏడవ వార్డు సచివాలయం వద్ద వినియోగదారుల నుంచి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్సీపీ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కూటమి ప్రభుత్వం కరెంట్ బిల్లులు పెంచి సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల కరెంట్ బిల్లులు విపరీతంగా పెరుగుతాయని చెప్పారు. బిల్లులు ముందుగానే చెల్లించాలని దీని ద్వారా వినియోగదారుడు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. కావున స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయవద్దంటూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి కన్వీనర్ ఎల్. సురేంద్ర, ఐద్వా కార్యదర్శి పి. రజిని, సత్యవతి, ఎస్. నాగేశ్వరరావు, పి. సురేష్, ఎండీ భాషా తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడిలో సంతకాలు సేకరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కూచిపూడిలో..

కూచిపూడి(మొవ్వ): ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మొవ్వ మండలం కూచిపూడి, పెదపూడిలో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. సంతకాల సేకరించిన వినతి పత్రాన్ని ముఖ్యమంత్రికి త్వరలో అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు, సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి నాయకుడు కొండా నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అధికారుల విచారణ



పమిడిముక్కల సబ్‌స్టేషన్‌లో విచారణ చేస్తున్న అధికారులు

తోట్లవల్లూరు(పమిడిముక్కల): పమిడిముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విజిలెన్స్ అధికారులు గురువారం విచారణ నిర్వహించారు. మండలంలోని తాడంకిలో అనుమతులు లేని ఓ లేఅవుట్‌లో అనధికార విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సంబంధించి సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ లోకాయుక్తకు, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. లోకాయుక్త ఆదేశాలతో ఏపీసీపీడీసీఎల్ ఎంక్వయిరీస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సయ్యద్ ఆసిఫ్, పర్సనల్ ఆఫీసర్ మారుతి స్థానిక సబ్‌స్టేషన్‌లో విచారణ చేపట్టారు. అనుమతులు లేని లేఅవుట్‌లో ఎలా స్తంభాలు వేశారు.. ఏ విధంగా లైన్లు ఏర్పాటు చేశారు అనే అంశాలపై ట్రాన్స్‌కో సిబ్బంది, ఫిర్యాదు దారుడైన శ్రీనివాస్‌గౌడ్ నుంచి వివరాలు సేకరించారు. విచారణ వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. యూఎఫ్ఆర్టీఐ ప్రతినిధులు బేతపూడి జోగేశ్వరరావు, బొల్లా శివపార్వతి, సాకే రాములమ్మ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



భుజబలపట్నంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాంబాబు

కై కలూరు: విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాన్ని చిత్తు చేసుకోవద్దని కై కలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు సూచించారు. భుజబలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ తెలియని నంబర్ల నుంచి ఫోన్లకు మెసేజ్ వస్తే అటువంటి ఫైల్స్ ఓపెన్ చేయొద్దన్నారు. అలా చేస్తే బ్యాంకు అకౌంట్‌లో డబ్బులు మొత్తం సైబర్ నేరగాళ్ల వశమవుతాయని చెప్పారు. విద్యార్థులు ఆన్‌లైన్ మోసాలు గుర్తిస్తే సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ – 1930, అలాగే డ్రగ్స్ గురించి టోల్ ఫ్రీ నంబర్ – 1972, పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్ – 112లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.నరసింహారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ పన్ను చెల్లింపుపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సందీప్

గుడివాడ టౌన్: ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో అకౌంటెంట్‌లు అవగాహన పెంచుకుని చెల్లింపుదారులకు సేవలందించాలని గుడివాడ ఆదాయ పన్నుల శాఖాధికారి వార్డు–1 వి. సందీప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయంలో అకౌంటెంట్‌ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయ పన్ను చెల్లింపు విషయంలో తాజాగా జరిగిన సవరణలను పన్ను చెల్లింపుదారులకు వివరించాలని సూచించారు. తప్పుడు డిడక్షన్‌లు, క్లెయిమ్‌లు చేయడం వల్ల తదుపరి ఎదురయ్యే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు. దీని వల్ల జరిమానాలు, ఇతర శిక్షలు కూడా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఐటీఓ జి. ప్రభాకరరావు, ఇన్‌స్పెక్టర్లు దంటు సురేష్‌బాబు, రవికుమార్, అకౌంటెంట్‌లు పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందించాలి

పెదపారుపూడి: చిన్న, సన్నకారు రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను కూటమి ప్రభుత్వం వెంటనే అందించాలని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఆల రమేష్ బాబు డిమాండ్ చేశారు. మండలంలోని భూషణగుళ్ళలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా కోసం ఎరువుల షాపుకు వెళ్లితే గుళికలు, జింక్ లింక్ పెట్టి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కూడా ప్రభుత్వం తమకేమి పటనట్లు వ్యవహరించడం సిగ్గు చేటు అని మండిపడ్డారు.

వీధి లైట్లతో చీకటికి చెక్

మండవల్లి: వీధి లైట్లు వెలిగించి చీకటికి చెక్ పెట్టొచ్చని సర్పంచ్ మెండా ఝాన్సీ అన్నారు. మండవల్లిలోని పురవీధుల్లో దెబ్బతిన్న వీధి లైట్ల స్థానంలో గురువారం కొత్తవి ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఝాన్సీ మాట్లాడుతూ వీధి దీపాలు వెలగకపోతే ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని కావున లైట్లన్నీ వెలిగే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

శ్యామలాంబ సన్నిధిలో ఎమ్మెల్యే నాయకర్

కైకలూరు: నరసాపురం జనసేన ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ దంపతులు కై కలూరు శ్యామలాంబ అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పీఎన్‌కే శేఖర్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మర్యాదలతో ఇద్దరినీ సన్మానించారు.

148 పింఛన్ల మంజూరు

ముదినేపల్లి రూరల్: మండలంలో 148 మంది వితంతువులకు నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భర్తలు పింఛన్లు పొందుతూ చనిపోయిన వారి స్థానంలో భార్యలకు ఈ పింఛన్లు మంజూరయ్యాయని చెప్పారు. వీరికి ఈ ఆగస్టు నుంచి రూ.4 వేలు చొప్పున పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

డ్రెయిన్ల మరమ్మతుల పరిశీలన



కైకలూరు: నియోజకవర్గంలోని డ్రెయిన్లు, పంట కాలువల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. రాచపట్నం గ్రామంలో జరుగుతున్న డ్రెయిన్ల మరమ్మతులను గురువారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రాచపట్నం సర్పంచ్ మంగారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పలపాటి జయదేవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాయిబాబాకి ప్రత్యేక పూజలు

గుడివాడ టౌన్: స్థానిక గౌరీశంకరపురంలో వేంచేసి ఉన్న శ్రీగౌరీశంకరస్వామి వారి ఉపాలయమైన షిర్డీ సాయి మందిరంలో గురువారం బాబావారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాలను ఈఓ వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

అన్నసమారాధన

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీదత్త పరంపర సహిత షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత బాబాకు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నుల వితరణ



కై కలూరు: విద్యా బుద్ధులు నేర్పిన పాఠశాలకు పూర్వ విద్యార్థి సాయం చేయడం అభినందనీయమని గోనెపాడు పాఠశాల హెచ్ఎం మారెళ్ల రవిశంకర్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బత్తిన మాధవరావు గురువారం పాఠశాలలోని విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు లీల, మాధవరావు మిత్రులు బత్తిన సీతారామయ్య, బత్తిన శ్రీనివాసు, లక్ష్మణ్, పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గౌరవం

కైకలూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే గౌరవం లభిస్తుందని ఎంపీపీ అడవి కృష్ణ పేర్కొన్నారు. ఆటపాక ఎంపీపీఎస్ పాఠశాలలో పీఎస్ ప్రధానోపాధ్యాయుడు కిలారి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును సత్కరించారు.

విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితం కావొద్దు



కైకలూరు ఓరియంటల్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న పంకజ్ కుమార్

కై కలూరు: విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా ప్రపంచీకరణ నేపథ్యంలో అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఏలూరు జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కురెళ్ల పంకజ్ కుమార్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీ ఆదేశాల మేరకు పాఠశాలల్లో గ్రంథాలయ ఏర్పాట్లపై కై కలూరు ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ గ్రంథాయాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గ్రంథాలయ ఏర్పాట్లపై నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో డి.రామారావు, హెచ్ఎం కట్టా విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతుల ఆందోళన



వరినాట్లు పరిశీలిస్తున్న ఏఓ హెప్సిబారాణి

అడపావారిపాలెం(మోపిదేవి): యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అడపావారిపాలెం రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా అందడం లేదని గురువారం పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో సుమారు నాలుగు వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. వరినాట్లు పూర్తి కావడంతో ప్రారంభదశగా యూరియా ఎక్కువగా రైతులు వినియోగిస్తారు. మండలంలో 10 రైతు సేవా కేంద్రాలు ఉండగా అందులో సగం కేంద్రాలకు కూడా యూరియా దిగుమతి కాలేదు. మండలానికి సుమారు 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు కేవలం 236 మెట్రిక్ టన్నులు మాత్రమే మండలానికి వచ్చింది. ఇదే విషయమై ఏఓ హెప్సిబారాణి మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన యూరియాను నాట్లు పూర్తయిన చోట్ల రైతులకు అందించామని చెప్పారు. ఇంకా 255 మెట్రిక్ టన్నులు అవసరం ఉంటుందని, లోడు వచ్చిన తర్వాత రైతులకు తగిన మోతాదుల్లో అందజేస్తామని ఏఓ తెలిపారు.

జిల్లా క్రీడా కార్యదర్శి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మచిలీపట్నంఅర్బన్: జిల్లా డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ(డీఎస్జీఎస్) పదవీకాలం ముగియడంతో 2025 నుంచి 27 వరకు రెండేళ్లకు గాను నూతన క్రీడా కార్యదర్శి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ పీవీజే రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యా సంచాలకులు ఉత్తర్వులు ప్రకారం 58 ఏళ్ల లోపు వయసు కలిగి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న పీఈటీలు దరఖాస్తు చేయవచ్చన్నారు. గతంలో ఇదే పదవిలో పనిచేసిన వారు అర్హులు కాదని తెలిపారు.

అర్హులైన పీఈటీలు ఆగస్టు 4వ తేదీ లోగా దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.